# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-12-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతిలో జరిగే "భారతీయ విజ్ఞాన్ సమ్మేళనం" కార్యక్రమంలో కేంద్రమంత్రి జితేంద్రసింగ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొంటారు.**

2. **సంక్రాంతి సందర్భంగా తెలంగాణలో వచ్చే నెల 11, 12, 13 తేదీల్లో గాలిపటాల పండగ నిర్వహించాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఆదేశించారు.**

3. **గ్రామీణాభివృద్ధిలో సహకార బ్యాంకుల కీలక పాత్ర పోషిస్తున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**

4. **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 7 కట్టడాలను ఐకానిక్ భవనాలుగా నిర్మిస్తున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు.**

5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

==========================

ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వేదికగా జరిగే "భారతీయ విజ్ఞాన్ సమ్మేళనం" కార్యక్రమంలో కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్రసింగ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొంటారు. ఈ నెల 29 వరకు జరిగే ఈ జాతీయ సమ్మేళనంలో దేశ వ్యాప్తంగా వెయ్యిమందికిపైగా శాస్త్రవేత్తలు పాల్గొననున్నారు. పూర్వీకులు అందించిన శాస్త్ర విజ్ఞానాన్ని ఆధునిక అవసరాలకు తగినట్లుగా మలచుకోవడమే ప్రధాన లక్ష్యంగా ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నారు సదస్సులో వివిధ విభాగాలకు సంబంధించి పత్ర సమర్పణలు, చర్చలు జరగనున్నాయి. అనంతరం తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా పోలీసు కార్యాలయాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని అధికారులు తెలిపారు.

--------------------------

వ్యవసాయం, దాని అనుబంధ రంగాలను అభివృద్ధి చేయడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంపొందించేలా సహకారం అందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ లో కొబ్బరి పార్క్, ఆక్వా ల్యాబ్, మ్యాంగో బోర్డుతో సహా వ్యవసాయ విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు ముఖ్యమంత్రి నిన్న విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి తీసుకున్న చర్యలను,

అనుసరిస్తున్న విధానాలను కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, వ్యవసాయ యాంత్రీకరణ, ఆహర శుద్ధి వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించామని ముఖ్యమంత్రి వివరించారు.

---------------------------

సంక్రాంతి సందర్భంగా తెలంగాణలోని చెరువుల వద్ద వచ్చే నెల 11, 12, 13 తేదీల్లో గాలిపటాల పండగ నిర్వహించాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ రేవంత్ రెడ్డితో నిన్న సమావేశమైయ్యారు. హైడ్రా ఆధ్వర్యంలో చేపట్టిన చెరువుల పునరుద్ధరణ గురించి వివరించారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, పర్యాటకశాఖతో కలిసి గాలిపటాల పండగ ఘనంగా చేపట్టాలన్నారు. హైటెక్‌సిటీ తుమ్మిడికుంటలో నిర్వహించే పతంగుల పండగకు ఐటీ ప్రముఖులు, ఉద్యోగులను ఆహ్వానించాలని సూచించారు. కూకట్‌పల్లి నల్లచెరువు వద్ద సినిమా ప్రముఖులతో, రాజేంద్రనగర్ బురుకుద్దిన్ చెరువు దగ్గర క్రీడాకారులతో నిర్వహించాలని ఆదేశించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ రోజు ఢిల్లీ వెళ్లనున్నారు. రేపు ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ – సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

---------------------------

గ్రామీణాభివృద్ధిలో సహకార బ్యాంకుల కీలక పాత్ర పోషిస్తున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా తెనాలి మండలంలోని గుడివాడ గ్రామ సహకార సంఘ పాలక వర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 7 కట్టడాలను ఐకానిక్ భవనాలుగా నిర్మిస్తున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు. రాజధాని ప్రాంతంలో చేపట్టనున్న హైకోర్టు నిర్మాణానికి పునాది పనులను ఆయన నిన్న సాయంత్రం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మొత్తం 21 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం జరుగుతుందన్నారు. 2027 చివరికి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి వివరిస్తూ,

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

వరుస సెలవుల దృష్ట్యా తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లు, నారాయణగిరి షెడ్లు భక్తులతో నిండిపోయాయి. శిలాతోరణం క్యూలైన్ వరకు భక్తులు వేచి ఉన్నారు. స్వామి వారి దర్శనానికి 30 గంటల సమయం పడుతోంది. క్యూలైన్లలోని భక్తులకు తాగునీరు, పాలు, టీ, అన్నప్రసాదాలను పంపిణీ చేస్తున్నామని టీటీడీ అధికారులు తెలిపారు. క్యూలైన్లన్నీ నిండిపోవడంతో యాత్రికుల వసతి సముదాయాలలో భక్తులు వేచి ఉండాలని రద్దీ తగ్గిన తర్వాత సర్వదర్శనంకు రావాలని భక్తులకు టీటీడీ సూచించింది. ఇక రద్దీ కారణంగా రేపు,

ఎల్లుండి, 29వ తేదీలకు సంబంధించి శ్రీవాణి ఆఫ్ లైన్ టికెట్ల జారీని రద్దు చేసినట్లు టిటిడి ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈరోజు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ–టీజీఎస్ఆర్టీసీలో ఉద్యోగాలకు ఈ నెల 30 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలంగాణ పోలీసు నియామక మండలి సంచాలకులు వి.వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 84 ట్రాఫిక్ సూపర్‌వైజర్ ట్రైనీ, 114 మెకానికల్ సూపర్‌వైజర్ ట్రైనీలు కలిపి మొత్తం 198 ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ జారీ చేశామని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 30 ఉదయం 8 గంటల నుంచి 2026 జనవరి 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు www.tgprb.in వెబ్‌సైట్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

---------------------------

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వికసిత భారత్–గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవికా మిషన్ గ్రామీణ్ – వీ బీ జి రామ్ జీపై ఈరోజు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నారు.కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశాల్లో భాగంగా చట్టంపై శ్రామికులు, ప్రజలకు గ్రామసభల్లో అవగాహన కల్పించడంతో పాటు చర్చించనున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతుంది. ఏజెన్సీతో పాటు ఇతర ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురుస్తోంది. పలు జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగలలో 5.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవగా.. తెలంగాణాలోని సంగారెడ్డి జిల్లాలోని కోహిర్‌లో 7.4 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

=====================